సంక్రాంతి కథానికల పోటీలో బహుమతి పొందిన కథ

కథ

# మనసంతా....

శ్రావణి ఓ పక్క వంట చేస్తూ - ఇంకో వైపు ఆఫీసుకి తయారవుతూ హడావిడిగా ఉంది. భర్త మోహన్ - సింక్ దగ్గర లంచ్ బాక్సులు కడుగుతున్నాడు.




"మమ్మీ.... యుద్ధంలో ధర్మరాజు తప్పు చేసినా కృష్ణుడు దేవుడు కదా.... ఎందుకు ఊరుకున్నాడు" ఆరేళ్ల ఆర్తి అడుగుతోంది. నిన్నరాత్రి టీ.వీ.లో ఏదో భారతం సినిమా చూసినప్పటి నుంచీ ఆ ప్రశ్న తనని వేధిస్తోంది.

"తెల్లారిందా తల్లీ... నీ సందేహాలకి.... నాకు తెలీదు కానీ - డాడీ నడుగు." ఓరకంటితో మోహన్‌ని చూస్తూ అంది శ్రావణి.

"తాతయ్య నడుగమ్మా" అంటూ ఏదో పని ఉన్నట్టు బాత్‌రూమ్ కేసి నడిచాడు మోహన్. ఆ "ప్రశ్నావళి"కి జవాబు చెప్పటం మొదలు పెడితే, ఇక తను ఆఫీస్‌కి వెళ్లినట్టే అనుకుంటూ.

అప్పటికే టీ.వీ.లో వస్తున్న భక్తి కార్యక్రమంలో లీనమైపోయిన తాతయ్యని చూసి - తనని పట్టించుకోవాలంటే ఏం చేయాలో అదే చేసింది ఆర్తి. రిమోట్ లాక్కుని స్విచ్చాఫ్ చేసింది. ఓ క్షణం చిర్రున కోపం వచ్చినా చిట్టితల్లి చిరునవ్వుల్లో అది దూదిపింజ కంటే తేలిగ్గా ఎగిరిపోయింది.

"తాతయ్యా... ముందు నాకిది చెప్పు..."అంటూ తల్లిని అడిగిన ప్రశ్నే అడిగింది.

"మరి నా లంచం నాకిస్తే చెబుతా..."

"అదేం కుదరదు... నాకు చెప్పాకే.... నీకు...."

"కౌరవులు అంతకంటే పెద్ద తప్పులు చాలా చేశారమ్మా. అందుకే కృష్ణుడు ధర్మరాజుని ఏమీ చేయలేదు"

"అంటే - కొంచెం తప్పులు చిన్ని చిన్నివి చేయొచ్చన్నమాట" గొంతులో పచ్చి వెలక్కాయ పడటం అంటే ఏమిటో ఇన్నాళ్లకి అనుభవంలోకి వచ్చింది తాతయ్యకి. ఆయన తాతయ్య భారతం అంతా వేసవి శెలవుల్లో వెన్నెట్లో వేసిన మంచాల మీద చెప్పినప్పుడు కానీ, యువకుడిగా అనేక పౌరాణిక సినిమాలు చూసినప్పుడు కానీ, రిటైర్ అయ్యాక విన్న అనేక ప్రసంగాల్లో కానీ - ఎప్పుడూ తనకి ఈ డౌటు రాలేదు. ఇలాంటి నిర్ధారణా చేసుకోలేదు.

బొల్లాప్రగడ వెంకట పద్మరాజు

ఆర్తి తను ఇస్తానన్న లంచం - ముద్దు ఇస్తుండగానే "ఆరూ.... బై" అంటూ ఆఫీసులకి బయల్దేరారు శ్రావణీ - మోహన్. "తాతయ్యని

విసిగించక తొందరగా రెడీ అయ్యి స్కూల్‌కి వెళ్లమ్మా" అంటూ వెళ్లిపోయింది శ్రావణి. ఆర్తీకి స్నేహితుడు, టీచరూ, గైడూ అన్నీ తాతయ్యే.

ఇంకోరోజు – "తాతయ్యా.... దేవుడు కొందరిని మంచివాళ్లుగానూ, కొందరిని చెడ్డవాళ్లుగానూ పుట్టించడం ఎందుకు? అందరినీ మంచివాళ్లుగానే పుట్టిస్తే ఎంత బాగుంటుందో కదూ !" అంది. "ఆర్తీ ! నీకున్న బొమ్మల్లో అన్నీ ఒకే రంగు, ఒకేలాగా ఉంటే నీకు నచ్చుతాయా? దేవుడికీ అంతే – మానవులంతా ఆయన చేతిలో బొమ్మలు కాబట్టి – ఆయన ఇష్టం వచ్చినట్టు రకరకాలుగా సృష్టించుకుంటాడు" అని చెప్పారాయన.

ఓ రాత్రి తాతయ్య పక్కన పడుకుంటూ అడిగింది. "తాతయ్యా ! కృష్ణుడు దేవుడన్నావు కదా ! మరి మా ఫ్రెండ్ జుబేదా "అల్లా" దేవుడనీ, జోసఫ్ ఏమో జీసస్ దేవుడనీ అంటున్నారేం". "అమ్మా .... దేవుడొక్కడే... నాకు కృష్ణుడిలాగా కనిపిస్తాడు. జుబేదా తాతగారికి అల్లాగాను, జోసఫ్ తాతగారికి జీసస్‌గాను కనిపిస్తూ ఉండొచ్చు. ఇంకా బోలెడుమందికి బోలెడు రూపాల్లో కనబడతాడు"

"ఓహో.... అలాగా!" అంటూ నిద్రలోకి జారుకుంది.

అప్పుడే మావగారికి పాలగ్లాసు ఇవ్వటానికి వచ్చిన శ్రావణి "హమ్మయ్య! మావయ్యగారు ఉండబట్టి బతికిపోయాం – దీని ప్రశ్నలకి జవాబులు చెప్పేసరికి నా పని అయిపోయేది. పూర్వం పది మందిని పెంచటానికి ఎంత ఓపిక కావలో – ఒక్క పిల్లని పెంచటానికి అంతే ఓపిక అవసరమయ్యేట్టు పుట్టిస్తున్నాడు పిల్లల్ని – ఆ దేవుడు" అనుకుంది.

తాతయ్యమాత్రం "భగవాన్ ! మతం పేరుతో మారణకాండకి తలపడే వేలాదిమంది కూడా ఇలా సమాధానపడి, ప్రజలంతా నిశ్చింతగా నిద్రపోయే రోజు ప్రసాదించు తండ్రీ" అనుకున్నాడు.

తరువాతిరోజు....తను ఆఫీసులో ఆడిటింగ్ జరుగుతోందనీ, దానివల్ల లేటుగా వస్తాననీ చెప్పింది శ్రావణి. మోహన్ కూడా "నాకు మీటింగ్ ఉంది. లేటుగా వస్తాను నాన్నగారూ... ఆర్తీని సాయంత్రం పార్క్‌కి తీసుకెళ్లండి" అన్నాడు. సంతోషంతో అరిచేతులు చరుచుకున్నారు తాత – మనవరాలు.

రాత్రి ఏడుగంటల వేళలో మోహన్‌కి ఓ కాల్ వచ్చింది – "మీ అమ్మాయి ఇక్కడ ఒంటరిగా ఏడుస్తోంది. తొందరగా వచ్చేయండి" అని. శ్రావణికి కూడా అదే వ్యక్తి ఫోన్ చేశాడు.

అరగంటలో ఇద్దరూ అక్కడికి చేరుకున్నారు. అంతా గందరగోళంగా ఉంది. జనం పరుగులు, పోలీసుల ఈలలు – 108 వాహనపు హారన్ల మోత. టీ.వీ. ఛానెల్ రిపోర్టర్లు కెమెరాలతో హడావిడి. అక్కడ ఎవరో బాంబులు పేల్చారట.

ఆర్తిని అక్కున జేర్చుకుని గొల్లుమంది శ్రావణి. మోహన్ పరిస్థితి అలాగే ఉన్నా– నలుగురిలో బాగుండదని తమాయించుకుంటున్నాడు. ఒకేసారి ఇద్దరూ అరిచారు "తాతయ్య ఏరి...."

"స్వీట్ తీసుకొస్తానని అటు వెళ్లారు. ఇంకా రాలేదు" ఏడుస్తోంది ఆర్తి. ఒక్క ఉదుటున అటు పరుగెత్తబోయాడు మోహన్. ఆర్తిని అప్పటివరకూ చూసి, వీళ్లకి ఫోన్ చేసినాయన "వద్దండీ, అక్కడే పేలాయి బాంబులు. ఇంకా ఎన్ని ఉన్నాయో" అంటూ పట్టుకున్నాడు. "జనరల్ ఆసుపత్రికి నడవండి. అక్కడ ఉంటే చూడొచ్చు" అన్నాడు.

రాత్రి పన్నెండింటికి తెలిసింది తన తండ్రి ఇక 'తీపిజ్ఞాపకం' అయిపోయాడని.

నెల గడిచినా – మామూలు మనుషులు కాలేకపోయారు శ్రావణీ, మోహన్.

శ్రావణి భారతం పుస్తకం చదువుతోంది – ఆర్తి డౌట్లు ఇక తీర్చాల్సింది తనే – అని.

ఎప్పుడూ హెడ్‌లైన్స్ మాత్రమే చూసే మోహన్ ఇప్పుడు పేపరు శ్రద్ధగా చదువుతున్నాడు – ఏ మూలయినా మత విద్వేషాలు తగ్గించే సమాచారం దొరుకుతుందేమోనని.

ఆర్తి మాత్రం – ప్రశ్నలు అడగటమే లేదు! – ప్రశ్నావళి 'నిండుకుని' కాదు – మనసంతా వాటితోనే నిండిపోయి.



చినుకు మాసపత్రిక ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో కోపూరి పుష్పాదేవి రచించిన 'మరోకోణం' కథల సంపుటి ఆవిష్కరణ సభలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రఖ్యాత కథకులు కాళీపట్నం రామారావు. వేదికపై విమర్శకులు ద్వా.నా.శాస్త్రి, కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్య, కథకులు పెద్దిభొట్ల సుబ్బరామయ్య, సంపుటి రచయిత్రి శ్రీమతి కోపూరి పుష్పాదేవి, డా॥సి.హెచ్.భవానీదేవి, చినుకు మాసపత్రిక ఎడిటర్ నండూరి రాజగోపాల్‌తో పాటు సభాధ్యక్షులు కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జి.వి.పూర్ణచందులు చిత్రంలో ఉన్నారు.



చినుకు మాసపత్రిక ఆధ్వర్యంలో శ్రీ కోపూరి రామచంద్రరావు & పుష్పాదేవి గార్ల సౌజన్యంతో శ్రీమతి విస్సంశెట్టి రత్నమాణిక్యం స్మారక విద్యార్థుల కథలపోటీ బహుమతి ప్రదానోత్సవ సభలో ప్రముఖ కథకులు, కథానిలయం వ్యవస్థాపకులు శ్రీ కాళీపట్నం రామారావుగారిని సత్కరిస్తున్న శ్రీమతి పుష్పాదేవి దంపతులు, శ్రీ జి.వి.పూర్ణచంద్, డా॥సి.హెచ్.భవానీదేవి, ప్రముఖ కవి శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య, శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్యలు చిత్రంలో ఉన్నారు.